క్లుప్తంగా

సీహెచ్‌సీ భవన నిర్మాణం పరిశీలన



పెదకూరపాడు: పెదకూరపాడులో రూ.8.69 కోట్లతో నిర్మిస్తున్న నూతన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. 24ఏళ్ల క్రితం నిర్మించిన సీహెచ్‌సీ శిథిలావస్థకు చేరిందని, ఈ విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే రూ.8.69 కోట్లతో నూతన భవనం మంజూరు చేయడం జరిగిందన్నారు. మరో మూడు నెలల్లో ప్రజలకు భవనం అందుబాటులోకి వస్తుందన్నారు. ఇద్దరు డెంటల్ డాక్టర్లు, ఐదుగురు డాక్టర్లు సీహెచ్‌సీలో అందుబాటులో ఉంటారని తెలిపారు. 30 పడకల ఆసుపత్రిగా దీనిని తీర్చిదిద్దామన్నారు.

నేడు జలాల్‌పురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

పెదకూరపాడు: జలాల్‌పురం గ్రామంలో శనివారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, అభిమానులు పాల్గొనాలని పేర్కొన్నారు.

వృద్ధురాలి వ్యథ తెలుసుకుని..

విప్పర్ల (క్రోసూరు): రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విప్పర్ల గ్రామానికి చెందిన వృద్ధురాలు మందా సుబ్బులుకు.. వలంటీరు కర్నాటక రాజరాజేశ్వరి పింఛను నగదు శుక్రవారం అందజేశారు. చికిత్స పొందుతున్న వృద్ధురాలి వివరాలు తెలుసుకుని.. ఆమె అవసరాలను గుర్తించిన వలంటీర్ జీజీహెచ్‌కు వెళ్లి వేలి ముద్ర తీసుకుని పింఛను నగదు అందించడం పై గ్రామస్తులు అభినందిస్తున్నారు.

ఇసుక లారీలను మినీ బైపాస్‌కు మళ్లించాలి

అమరావతి: మండల పరిధిలోని పలు ఇసుక రీచ్‌లకు రాకపోకలు సాగించే భారీ ఇసుక లారీలను మినీ బైపాస్ రోడ్డుకు మళ్లించాలని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అమరావతి గ్రామంలో వాహన రద్దీ అధికంగా ఉండటం వల్ల.. భారీ ఇసుక లారీల రాకతో ప్రమాదం సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు జరిగాయని తెలిపారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఎస్‌ఆర్‌కేహెచ్ హైస్కూల్ వరకు క్రోసూరు రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల ప్రతిరోజూ సుమారు పది సార్లు ట్రాఫిక్ జాం అవుతోందన్నారు. పోలీసు అధికారులు భారీ ఇసుక లారీలను అమరావతి గ్రామంలోకి రాకుండా.. మినీ బైపాస్ రోడ్డుకు మళ్లించాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న సత్తెనపల్లి సుగాలికాలనీ జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎ.శ్రీనివాసరెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యార్థినిలతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది తోనూ శ్రీనివాసరెడ్డి అనుచితంగా ప్రవర్తిస్తుండటంతో తల్లిదండ్రులు, సిబ్బంది ఉన్నతాధికారులకు గతంలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణాధికారిగా నియమించబడిన నరసరావుపేట ఎంఈఓ నివేదిక ఆధారంగా శ్రీనివాసరెడ్డిని సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

జగనన్నకు మద్దతుగా నిలవాలి

బెల్లంకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనకు మద్దతుగా నిలవాలని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ తెలిపారు. శుక్రవారం అన్నీ గ్రామాలలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులతో కలసి 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. నందిరాజుపాలెం, నాగిరెడ్డిపాలెం గ్రామాల్లో ఎంపీపీ పద్మ పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు ఓర్చు సాంబ శివరావు, మండల సచివాలయ కన్వీనర్ వెంకటరెడ్డి, చింతారెడ్డి సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాలను సందర్శించిన న్యాయవాదులు

వినుకొండ టౌన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఏ. తౌషిద్ హూస్సేన్ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు చాగంటి వీరాంజనేయ చౌదరి ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని వార్డులను పరిశీలించి, ప్రసూతి వార్డులోనున్న బాలింతల క్షేమ సమాచారాన్ని, రోగులకు అందిస్తున్న సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట వైద్యులు శ్రీనివాసరెడ్డి, బార్ అసోసియేషన్ కార్యదర్శి కొత్త హనుమంతరావు, కోశాధికారి కాకాని నాగేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు ఎంఎస్ ప్రసాద్, నీలం శేఖర్ బాబు, ఎలీషా, అశోక్‌బాబు, సురేష్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన సాగిస్తున్న సీఎం జగన్

మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: అవినీతి రహిత పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తోనే సాధ్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నీవే జగన్' కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను తెలియచేసి ప్రజా మద్దతు కోరే ఐదు ప్రశ్నలను అడిగి వాటికి సమాధానాలు నమోదు చేసుకున్నారు. వారి మద్దతు మేరకు తలుపుకు జగన్‌మోహన్ రెడ్డి స్టిక్కర్ను అంటించి సెల్ ఫోనుకు స్టిక్కర్ వేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రెడ్డికి మద్దతు తెలియచేసేలా వారి సెల్ నుంచి నెంబర్ కు మిస్డ్ కాల్ ఇచ్చారు. ఎన్నికల వాగ్దానాలను 96 శాతం ఇప్పటికే పూర్తి చేసి ధైర్యంగా ప్రజల మద్దత్తు కోరుతున్నామన్నారు. ప్రజలకు మరింత చేరువై వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ జెండా మరోసారి ఎగరవేసేందుకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు సైనికుల పనిచేయడం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్ఆర్‌సీపీ సత్తెనపల్లి మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జై బూన్ బీ, జెడ్పీటీసీ సంకటి నాగేశ్వరమ్మ, గ్రామ సర్పంచ్ కొరివి అనిల్ కుమార్, నాయకులు ఇస్సా, శ్యాంసన్, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉంది

నకరికల్లు: ప్రజలను ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని కుంకలగుంటలో మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు, జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలోని ఎస్సీకాలనీలోని ఇళ్లకు వెళ్లి ప్రభుత్వపాలనపై వారి అభిప్రాయాన్ని సేకరించారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయో లేదో ఆరాతీశారు. గృహస్తుల అనుమతి తీసుకుని వారి ఇంటి గోడలకు జగనన్న నువ్వే మా నమ్మకం స్టిక్కర్లను ఆయనే స్వయంగా అంటించారు.



ఇంటి తలుపుకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అంటిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

8296082960 నంబర్‌కు గృహస్తుల ఫోన్ ద్వారా మిస్డ్ కాల్ ఇప్పించారు. ప్రజల వద్ద నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనపై సంతృప్తి వ్యక్తం చేయడంతో వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని లక్షా అరవై వేల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడి 4ఏళ్ల పాలనలో అమలు చేసిన నవరత్నాలు ప్రతిఫలాన్ని తెలుసుకుంటున్నట్లు తెలిపారు. 7 లక్షల మంది కార్యకర్తలు కార్యక్రమంలో భాగస్వాములవుతారన్నారు. రానున్న ఏడాదికాలం నిరంతరం ప్రజల్లోనే ఉండడానికి ఇలాంటి కార్యక్రమాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూపొందించారన్నారు. నియోజకవర్గంలో నూటికి నూరుశాతం విజయవంతం చేసేలా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 175 సీట్లకు 175 సీట్లు సాధించడమే లక్ష్యంగా పనితీరు ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు ధన్వంతరి, వీరారెడ్డి, వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలుదేవర్లపాడులో జగనన్నే మా భవిష్యత్తు

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): మండలంలోని పలుదేవర్లపాడులో జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పది కుటుంబాలను వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లుతో కలిసి వారి ఇంటికి వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమపథకాలు, ప్రభుత్వం పనితీరు పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సానుకూలంగా స్పందించిన వారి సెల్ ఫోన్‌తో డయల్ చేయించారు. అనంతరం వారి అంగీకారం మేర ఇంటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ ను అంటించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ పెండెంబాబురావు, వైస్ చైర్మన్ కళ్ళంశివరామిరెడ్డి, సర్పంచ్ కంభంపాటికెజియారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్‌జెఎమ్‌రామలింగారెడ్డి, యనమాలసింగయ్య, రెండెద్దులవెంకటేశ్వరరెడ్డి, నక్కాశ్రీనివాసరావు, నేలటూరికోటేశ్వరరావు, మనికెరామయ్య, అప్పిరెడ్డి, మాజీ సర్పంచ్ బొడ్లపాటిసాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరులో ముమ్మరంగా 'జగనన్నే మా భవిషత్తు'

క్రోసూరు: 'జగనన్నే మా భవిషత్తు, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని క్రోసూరులో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులతో శుక్రవారం ముమ్మరంగా నిర్వహించారు. బుడగ జంగాల కాలనీ, చెంచు కాలనీ, షాలెం నగర్‌లో ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ దుగ్గి ఏడుకొండలు, వలంటీర్ ఫైరోజ్, అనూష, సయ్యద్ అబ్దుల్ రహీం, షేక్ ఖాదర్, గార్లపాటి దాసు, చిల్కా రవి, మేదర రోశయ్య, చిల్కా దాసయ్య, లక్కిపోగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ప్రేమను ప్రజల మాటల్లో వింటున్నాం..

'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు

పెదకూరపాడు: పెదకూరపాడులో 'జగనన్నే మా భవిష్యత్తు' ప్రచార కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నియోజకవర్గ పరిశీలికుడు పైలా సోమినాయుడుతో కలిసి శుక్రవారం నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ తిరిగారు. టీడీపీ పాలనలో జరిగిన అవినీతి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న మంచిని వివరించారు. జగనన్న పాలనపై సంతోషం వ్యక్తం చేసిన వారి ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్లు అంటించారు. ఊహించని విధంగా ప్రజా స్పందన వస్తోందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఈ సందర్భంగా తెలిపారు.

ప్రభుత్వంపై ప్రేమను వింటున్నాం..

ప్రభుత్వంపై ప్రేమను ప్రజల మాటల్లోనే వింటున్నామని నియోజకవర్గ పరిశీలికుడు పైలా సోమినాయుడు అన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించి ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయ్యారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో పెదకూరపాడు నియోజకవర్గంలో 50 వేల ఓట్లుతో నంబూరు శంకరరావు గెలుపు ఖాయమన్నారు. క్రోసూరు ఏఎంసీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, మండల పార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, మండల సచివాలయాల కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువ చేయాలి..

అమరావతి: జగనన్న పాలనపై ప్రజల్లో సంతృప్తి కనిపిస్తోందని.. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ప్రజలకు వైఎస్సార్ సీపీని మరింత చేరువ చేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పూజారి వీధిలో 'జగనన్నే మా భవిష్యత్' ప్రచారాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రభుత్వ పనితీరుపై ఐదు ప్రశ్నలకు ఇంటింటికి తిరిగి సమాధానాలను నాయకులు తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం చేసిన మేలును వివరించే కరపత్రాన్ని అందజేశారు. వారి అనుమతితో ఇంటి గోడకు జగనన్నే మా భవిష్యత్ స్కిక్కర్‌ను అంటించారు. ఎమ్మెల్యే శంకరరావు గత ప్రభుత్వ హయాంలో జరిగిన దోపిడీని.. ప్రస్తుత ప్రభుత్వ సంక్షేమాభివృద్ధిని గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ పాలనలో అవినీతి, అక్రమాలను ప్రజలకు వివరించి, జగనన్న ప్రభుత్వం ఇంటింటికీ ఎంత మేలు చేకూర్చిందో వివరించాలని సచివాలయ కన్వీనర్లను, గృహ సారథులను కోరారు. నియోజకవర్గ పరిశీలకుడు పైలా సోమినాయుడు, జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కోట హరిబాబు, జెడ్పీటీసీ కరుణకుమారి, కో-ఆప్షన్ సభ్యులు షేక్ హష్మీ, మండల పార్టీ అధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, నాయకులు అళ్ల శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.



కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ఘనంగా వెంకటేశ్వరస్వామి శాంతికల్యాణం

నకరికల్లు: స్థానిక శ్రీవెంకటేశ్వర స్వామి శాంతికల్యాణ మహోత్సవం శుక్రవారం కన్నులపండువగా జరిపించారు. స్థానిక రామదాసు కాలనీలో స్వామివారి ఆలయం నిర్మించి ప్రథమ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. వేడుకను పురస్కరించుకుని వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి విశేషద్రవ్యములతో అభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించారు. రుత్వికుల మంత్రోచ్చారణల స్వామివారి శాంతికల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని వేడుకలో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం ఉత్సవమూర్తుల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. పురవీధుల్లోకి వచ్చిన స్వామివార్ల ఉత్సవమూర్తులకు మహిళాభక్తులు వార్లుపోసి మొక్కులు చెల్లించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు.



నకరికల్లులోని వెంకటేశ్వరస్వామి వారి కల్యాణ వేడుక

ఆశ్రమ ఆస్తులను కాపాడండి

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్డులో గల శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ ఆస్తుల పై అక్రమంగా ప్రవేశించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ సీఐ యు.శోభన్ బాబును రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు సూచించారు. ఆశ్రమ బాధ్యులు, భక్తులు శుక్రవారం మంత్రి అంబటి రాంబాబును కలిసి ఆశ్రమ ఆస్తులలో కొంత భాగాన్ని పెద్దిరెడ్డి గోవిందరెడ్డి మరికొందరు ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలులో తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకొని అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆక్రమించాలని ప్రయత్ని స్తున్నారని వినతి పత్రం అందించారు. దీనిపై స్పందించిన మంత్రి అంబటి పట్టణ సీఐ శోభన్ బాబుకు ఫోన్ చేసి ఆశ్రమ ఆస్తులను అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకుని, ఆశ్రమ నిర్వహణకు అడ్డుపడుతూ నిరంతరం అక్రమాలకు ప్రయత్ని స్తున్నవారిపై విచారణ జరిపి తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఆశ్రమ ఆస్తులు పూర్తిగా రిజిస్టర్ కాబడినవని దాత ఆశయాలకు అనుగుణంగా గత 84 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు విద్య, వైద్య, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కొందరు కావాలని తప్పుడు పత్రాలు సృష్టించుకొని ఆశ్రమ ఆస్తులను ఆక్రమించు కోవాలను కోవడం మంచి పద్ధతి కాదని ఆశ్రమ బాధ్యుడు చింతాడ బ్రహ్మానందరావు విలేకరులకు తెలిపారు.



మంత్రి అంబటికి స్వామి వారి చిత్రపటాన్ని అందిస్తున్న రత్నాచారి, వేద విద్యార్థులు

రైతుభరోసా పథకానికి దరఖాస్తులు స్వీకరణ

శావల్యాపురం: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నూతన రైతులు రైతుభరోసా పథకం అర్హత పొందడానికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి (ఏవో) రామినేని రామారావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ నూతనంగా రైతులు పొలాలు కొనుగోలు చేసిన వెబ్‌ల్యాండ్‌లో నమోదైన వారసత్వం పొందిన వారందరు నూతనంగా దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందన్నారు. ఆధార్, పొలం పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా నంబరు జిరాక్స్‌లతో పాటు మరిన్ని వివరాల కోసం సమీపంలోని రైతుభరోసా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు

సత్తెనపల్లి: పట్టణంలోని రఘురాంనగర్ లో వడ్డవల్లి హనుమాన్ కమిటీ ఆధ్వర్యంలో త్రికోటేశ్వర స్వామి ఆశీస్సులతో హనుమాన్ ఉత్సవాల సందర్భంగా ఎడ్ల పందేలు శుక్రవారం 15వ వార్డు కౌన్సిలర్ గంట రమణమ్మ నేతృత్వంలో దాతల సహకారంతో ఉత్సాహంగా సాగాయి. మూడు రోజులుగా జరుగుతున్న ఎడ్ల పందేలకు మొత్తం 16 జతలు రాగా శనివారం ఫైనల్ పోటీలు జరగనున్నాయి. జాక్‌పాట్, సీనియర్, పాలదూడ్ల విభాగాల్లో పోటీలు చేపడు తున్నారు. జాక్‌పాట్‌లో విజయం సాధించిన జతకు మన్నెం శివనాగమల్లేశ్వరరావు రూ.30,116 లు, సీనియర్ విభాగంలో విజయం సాధించిన జతకు కీర్తిశేషులు గంటా సాంబశివరావు జ్ఞాపకార్థం కుమారుడు ఏసుబాబు రూ.20 వేలు, పాలదూడ్ల విభాగంలో విజయం సాధించిన జతకు రూ.5,116లు నగదు బహుమతులను అందించనున్నారు. పోటీలను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం రాత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి అంబటిని పూల మాలలు,దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, నాయకులు అచ్యుత శివప్రసాద్, గంటా ఏసుబాబు, నందిగం ఆదాం, బచ్చు మనోహర్, గంటా వెంకయ్య, తదితరులు ఉన్నారు.



ఎడ్ల పందెలను ప్రారంభిస్తున్న మంత్రి అంబటి

పాపుల కోసమే క్రీస్తు ప్రాణ త్యాగం

- గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ప్రార్థనలకు పోటెత్తిన క్రైస్తవ సోదరులు

సత్తెనపల్లి: దయామయుడైన క్రీస్తు శిలువపై చిందించిన రక్తం మానవాళికి శుభాలను సమకూర్చింది గనుక గుడ్ ఫ్రైడే ను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. పట్టణం తో పాటు మండలంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. క్రీస్తు అనగానే క్షమ, కరుణ గుణాలు గుర్తుకు వస్తాయి. లోకంలోని పాపులను పరిశుద్ధులను చేసేందు కు, వారికి క్షమను అందించేందుకు కరుణామయుడైన ఏసుక్రీస్తు శిలువపై తన ప్రాణాలను బలిపెట్టిన రోజే గుడ్ ఫ్రైడే దీన్ని శుభశుక్రవారం అని కూడా అంటారని ప్యారిస్ పాస్టర్ రెవ పి.స్వరూప్ కుమార్, అడిషనల్ పాస్టర్ రెవ జి. దయానందం అన్నారు. తన ఆత్మ బలిదానంతో పాపులకు దేవుని పరిశుద్ధ సన్నిధిలో స్థానం కల్పించిన ఈ శుక్రవారం ప్రపంచంలోని క్రైస్తవులందరూ శుభశుక్రవారం గా భావిస్తా రన్నారు. గుడ్ ఫ్రైడే ని పురస్కరించుకొని క్రైస్తవ లోకం 40 రోజుల పాటు లెంట్ డేస్ (సోక దినాలు) నిర్వహిస్తుందని, ఈ సమయంలో క్రైస్తవులు ఎలాంటి శుభకార్యాలు నిర్వహించలేదన్నారు. నిరంతరం దైవధ్యానంలోనే గడిపారని పొర పాటున కూడా చెడుపనులకు పాల్పడకుండా జాగ్రత్త పడతారన్నారు. కనీసం నూతన దుస్తులు కూడా ధరించరని చర్చిల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా మౌనంగా ప్రార్థనలు నిర్వహించడం, మట్టల ఆదివారం నాటితో లెంట్‌డేస్ ముగిశాయన్నారు. శుభ శుక్రవారాన్ని, ఆ తర్వాత పునరుత్థానం సందర్భంగా ఆదివారం పండుగను నిర్వహించుకునేందుకు క్రైస్తవ సోదరులు ఏర్పాట్లు చేసుకుంటారన్నారు. మానవుల పాప నివారణ కోసం ఏసుక్రీస్తు శిలువపై మరణించిన రోజే గుడ్ ఫ్రైడే అని ఇది మానవాళి అందరికీ ఓ మహోన్నతమైన రోజన్నారు. ఏసుక్రీస్తు నందు విశ్వాసం ఉంచిన వారు పాపముల నుంచి విముక్తి పొంది నిత్య జీవం పొందుతారన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనలకు క్రైస్తవ సోదరులు పెద్ద ఎత్తున పోటెత్తారు. క్రైస్తవ సోదరులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆయా చర్చిల కమిటీ సభ్యులు, సంఘ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే

రాజుపాలెం: ప్రభువైన ఏసుక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటల గురించి సంఘ కాపరి ఏ.మత్తయ్య వివరించారు. మండలంలోని అన్ని చర్చీలలో గుడ్‌ఫ్రైడేను ఘనంగా నిర్వహించారు. రాజుపాలెం, అనుపాలెంలో గల పరిసుద్ధ మత్తయ్య లూథరన్ చర్చీలలో, సంఘ కాపరీ ఏ.మత్తయ్య ఏసూక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటల గురించి, క్రీస్తు బోధనల గురించి వివరించారు. క్రీస్తు సోదరులు భక్తిశ్రద్ధలతో ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. సంఘస్తులు ఏడు మాటలలో పాలు పంచుకుని, ధ్యానించారు. ప్రతీ ఒక్కరు క్షమాగుణం కలిగి ఉండాలని, క్రీస్తు బాటలో నడవాలని సూచించారు.

క్రీస్తు సిలువ..పాపాల పరిహరణ

అమరావతి: మనుషుల పాపాలను పరిహరించటానికి ఏసుక్రీస్తు సిలువపై శిక్షింపబడ్డాడని ఫాదర్ భాస్కరరావు పేర్కొన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా స్థానిక పల్లోటి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు బోధనలు వివరించారు. క్రీస్తు బోధనల్లోని కరుణ, దయ, ప్రేమ, క్షమాపణ, పశ్చాత్తాపం వంటి మానవత విలువలను అందరూ కలిగి ఉండాలని హితోపదేశం చేశారు. మన వలె పొరుగు వారిపై దయ కలిగి.. ఆధ్యాత్మిక జీవనాన్ని సాగించాలని సూచించారు. భక్తులతో సిలువ మార్గం పల్లోటి చర్చి నుంచి ప్రారంభమై.. బస్టాండ్ సెంటర్, మద్దూరురోడ్ సెంటర్, గాంధీబొమ్మ సెంటర్, క్రోసూరు రోడ్డు మీదుగా తిరిగి చర్చికి చేరింది. 14 స్థానాల్లో దేవుని వాక్యాన్ని చదివి, భక్తులకు వినిపించారు. భక్తులు సిలువను మోయటానికి పోటీ పడ్డారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తును కొరడాలతో కొట్టి, ముళ్ళకిరీటం పెట్టి, శిలువపై వేలాడదీసిన రోజును క్రైస్తవ సోదరులు గుడ్‌ఫ్రైడే ను జరుపుకుంటారు. ఈ సందర్భంగా చర్చిల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. శిలువ పై క్రీస్తు పలికిన ఏడు మాటలు గూర్చి సంఘ కాపరులు వివరిస్తారు. ఉపవాస ప్రార్థనలు చేస్తారు. చర్చి ఆవరణలో బెల్లం తో కలిపిన పానకాన్ని భక్తులకు అందించి ఉపవాస దీక్షను విరమిస్తారు. ఆయా గ్రామాల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో చిన్నారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుడ్ ఫ్రైడే.. ప్రత్యేక ప్రార్థనలు

పెదకూరపాడు: గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పెదకూరపాడులోని తెలుగు బాప్టిస్టు చర్చిలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని, భక్తులకు క్రీస్తు సందేశమిచ్చారు. మానవుల పాపాలను హరించేందుకు తన రక్తాన్ని సిలువపై ఏసుక్రీస్తు చిందించారని తెలిపారు. ప్రపంచ మానవాళి క్షేమం కోసం ఆయన ప్రాణత్యాగం చేశారని వివరించారు. ఏసు చూపిన మార్గం.. ప్రపంచ శాంతికి దోహదపడిందన్నారు. లూథరన్, ఆర్‌సీఎం, ఫెలోషిప్, పెంతుకోస్తే దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు ఉపవాస దీక్షలను విరమించారు.



భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సోదరీమణులు



రాజుపాలెం చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న సంఘకాపరి



సందేశం ఇస్తున్న పాస్టర్ రెవ విశ్వరూప్ కుమార్, పక్కన అడిషినల్ పాస్టర్ రెవ దయానందం



క్రీస్తు మార్గంలో సిలువ మోస్తున్న ఆరాధకులు



ప్రత్యేక ప్రార్థనలో విశ్వాసులు

కలాం చేయూత సేవా కార్యక్రమాలు అభినందనీయం

మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: కలాం చేయూత అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి నిర్విరామంగా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని రాష్ట్ర జలవనలరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. కలాం చేయూత 12వ కార్యక్రమంలో భాగంగా కలాం చేయూత వ్యవస్థాక అధ్యక్షుడు వెలుగూరి శరత్ బాబు ఆధ్వర్యంలో దాతల చేయూతతో పట్టణంలోని 10వ వార్డులో కౌన్సిలర్ పెద్దింటి వెంకటేశ్వర్లు (చిట్టి) విజ్ఞాన మేరకు నిరుపేద వర్గానికి చెందిన కోయ శ్రీనివాసరావుకు బల్లరిక్షాను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వాలు అందించే పథకాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు సైతం పేదలకు చేయూతనిచ్చే కార్యక్రమాలు చేపట్టడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, షేక్ గని, అవ్వారు శ్రీని వాసరావు, సహారా మౌలాలి, షేక్ జానీ, (గుంటూరు మేస్త్రి) శివాపురం రామారావు, కొత్త రామకృష్ణ, పెద్దింటి నాగేశ్వరరావు, పెద్దింటి వెంకటేశ్వర్లు, బండి మల్లికార్జున రెడ్డి, కాటు మాల డేవిడ్, జడ ప్రసాద్, పాల్గొన్నారు.



బల్ల రిక్షా పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

శోభయమానంగా గరుడ వాహనాసేవ

సత్తెనపల్లి: చైత్ర మాసం, చైత్ర శుద్ధ పౌర్ణమి గరుడ వాహనాసేవ శుక్రవారం శోభయమానంగా జరిగింది. పట్టణం లోని రైల్వేస్టేషన్ రోడ్డులో గల అఖిలాండకోటి బ్రహ్మాండ నాయ కుడు, కలియుగ దైవం శ్రీశ్రీశ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారికీ విశేషంగా చైత్ర మాసం, చైత్ర శుద్ధ పౌర్ణమి, హనుమాన్ జయంతి పురస్క రించుకుని శ్రీవారికి స్నపన తిరుమంజనం శోభాయమానంగా జరిగింది. శ్రీవారి ఆలయంలోని గరుడల్వార్ మండపంలో వేంచేసి ఉన్న గరుడల్వార్ మూర్తికి, శ్రీమాన్ శ్రీ చిత్రకవి శ్యాము ఆచార్య రామానుజ దాసన్ విశేషా పూజ నిర్వహించిన అనంతరం, జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు, జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడిని దర్శిస్తే సర్వపాపాలు తొలుగుతాయని భక్తకోటి విశ్వాసం అని వివరించారు. భక్తులు సర్వాలంకార భూషితుడైన శ్రీవారికి అత్యంత ఇష్టమైన గరుడ వాహనంపై, రైల్వేస్టేషన్ పుర విధులలో దర్శనమిస్తూ భక్తులకు అభయ ప్రదానం చేశారు. ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గరుడ ముద్ద, తీర్థ ప్రసాదములు స్వీకరించారు. భక్తులకు ఏలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గరుడ వాహనం పై శ్రీవారు